క్లుప్తంగా


నేడు దేవనూరులో 'ఆరోగ్య సురక్ష'

మిడుతూరు: మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి వీరారెడ్డి గురువారం తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామానికి చెందిన ఖుర్షిద్‌బీ(40)అనే మహిళ కిడ్నీ వ్యాధితో గురువారం మృతిచెందింది. శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆదేశాల మేరకు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు నూనెపల్లె ఎల్లారెడ్డి, నూనెపల్లె రమణారెడ్డి, సాంబ, దర్గయ్య, అంజి, రాజేష్, సామేలు, శ్రీను, బాలు, చెంచుబాలకృష్ణ, వడ్డెశంకర్, నాగేషులు మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి విశేష పూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈకైంకర్యం జరిపిస్తున్నారు. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజను జరిపించారు. ఆ తరువాత దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

మిడుతూరు: కాంట్రాక్టు ఉద్యోగులకు మూడు నెలలుగా జీతం రావడం లేదని..వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టు ఉద్యోగులు మెడికల్ ఆఫీసర్ తిరుపతికి గురువారం వినతిపత్రం అందజేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు గత మూడు నెలలుగా జీతాలు రావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి నెల వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు ముర్తుజావలి, శ్యామలమ్మ, రత్నమ్మ, రామతులసి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

శివనందీశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 87వేలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలం కడమలకాల్వలోని నవనందుల్లో ఒకటైన శ్రీ శివనందీశ్వరస్వామి దేవస్థానంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈఓ నాగప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, మండల ఉపాధ్యక్షుడు రాగాల వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో రూ. 87,163 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. రెండేళ్ల రెండు నెలలకు భక్తులు ఈ మేరకు కానుకలు సమర్పించారని అన్నారు.

వేంపెంట గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీఓ

పాములపాడు: ఎంసీసీలో భాగంగా మండలంలోని వేంపెంట గ్రామాన్ని ఎంపీడీఓ సరస్వతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధుల్లో సచివాలయ సిబ్బందితో కలసి పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న విషయాన్ని ప్రజలకు తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకులు ఫొటోలు కనిపించరాదన్నారు. ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆమె వెంట హెడ్ కానిస్టేబుల్ రామేశ్వర్, పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, వీఆర్వో శేఖర్ ఉన్నారు.

పిల్లలను కొట్టిన కేసులో జైలు శిక్ష

పగిడ్యాల: మానవత్వం మరచి పిల్లలను విచక్షణారహితంగా కొట్టిన కేసులో నందికొట్కూరు కోర్టు అసిస్టెంట్ జడ్జి ముద్దాయికి ఆరు నెలలు జైలు శిక్ష విధించినట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ గురువారం తెలిపారు. స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన సగినేల వెంకటరమణ 2020లో అదే గ్రామానికి చెందిన ఉపేంద్ర, సంతోష్, హరికృష్ణలను గ్రామ శివారులోని నీళ్ల ట్యాంక్ వద్దకు పిలిచి కొట్టిన ఘటనలో నిందితునిపై 307, 323, 506 ఐపీసీ కేసు నమోదైందన్నారు. గురువారం కోర్టులో విచారణ జరుగగా ముద్దాయిపై నేరం రుజువు కావడంతో జడ్జి ఆరు నెలలు జైలు శిక్ష విధించారని ఎస్‌ఐ వెల్లడించారు.





జూపాడుబంగ్లా జంగాలపేట ప్రాథమిక పాఠశాల





తాటిపాడు యూపీ స్కూల్‌లో తాగునీటి కుళాయిలు నాడు-నేడు ఇలా..

'నాడు-నేడు'.. మారిన రూపురేఖలు

- ఆధునిక విద్యాబోధనకు పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మనబడి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ
- తరగతి గదుల్లో టేబుళ్లు, ఫ్యాన్లు, విద్యుత్‌దీపాలు
- విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



తాటిపాడు యూపీ పాఠశాలలో విద్యార్థుల తరగతి గది

ఇది కదా.. అభివృద్ధి

జూపాడుబంగ్లా: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి మన బడి నాడు -నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. సర్కారు బడుల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. అలాగే సీబీఎస్‌ఈ సిలబస్, డిజిటల్ విద్యాబోధనను ప్రవేశపెట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల, విద్యార్థుల ప్రశంసలు అందుకుంటున్నారు.

రూ.425.48కోట్లతో 185 పాఠశాలల ఆధునీకరణ

నందికొట్కూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 250 ప్రభుత్వ పాఠశాలలుండగా అందులో 42,850మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా నియోజకవర్గంలోని 185 పాఠశాలల్లో సుమారు రూ.425.48కోట్ల వ్యయంతో కార్పొరేటు స్కూళ్లను తలదన్నేలా రూపురేఖలు మార్చారు. 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబులు అందజేసి తరగతి గదుల్లో డిజిటల్ మానిటర్లను ఏర్పాటు చేసి వారికి ఆన్‌లైన్‌ద్వారా ఆధునిక విద్యాబోధన అందేలా చేశారు.

ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన

చంద్రబాబు పాలనలో ఏళ్ల తరబడి శిథిలమైన భవనాలు, చాలీచాలని గదులు, తాగునీటి కొరత, ప్రహరీ గోడలు, పందులు, కుక్కలతో విద్యార్థులు సహవాసం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని 185 పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ, విద్యార్థులు తాగేందుకు మినరల్ వాటర్ ప్లాంట్లు, ఆధునిక టాయ్‌లెట్లు, ప్రతి తరగతి గదిలో 4 ఫ్యాన్లు, 4 ట్యూబ్ లైట్లు, గ్రీన్‌చాక్ బోర్డు, విద్యార్థులకు డిజిటల్ తరగతులకు అవసరమైన 52 ఇంచుల టీవీ, ప్రతి తరగతి గదిలో ఆధునిక డెస్కులతో పాటు పాఠశాల గోడలపై విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా చిత్రపటాలు వేయించి పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు సీబీఎస్‌ఈ సిలబస్‌లో విద్యాబోధనను అమలుచేసి విద్యావేత్తల ప్రశంసలు పొందారు.



జంగాలపేట ప్రాథమికపాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటు

ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, గోరుముద్ద, జగనన్న విద్యాకానుక, వంటి సంక్షేమ పథకాలతో పాటు పాఠశాలల్లో ఇంగ్లిషు విద్యాబోధన అమలు చేయటంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో సీట్లు ఖాళీగా లేవని ఉపాధ్యాయులు బోర్డులు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. ప్రతి ఏటా విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే మొదటిరోజే విద్యార్థులకు జగనన్న కానుకగా రెండు జతల బట్టలు, టై, బెల్టు, బూట్లు, రెండు జతల సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డైరీ, స్కూలు బ్యాగును విద్యార్థులకు అందజేసి తల్లిదండ్రుల మన్ననలు పొందారు.



నూతనంగా నిర్మించుకున్న బాలురు, బాలికల మరుగుదొడ్లు

గోరుముద్ద కింద మెరుగైన మధ్యాహ్న భోజనం

పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. గోరుముద్ద పథకంలో భాగంగా పాఠశాలల్లో నూతనంగా అమలు చేసిన మెనూ ప్రకారంగా సోమవారం: అన్నం, పప్పుచారు, ఎగ్‌కర్రీ, చిక్కీ, మంగళవారం: పులిహోరా, టమోటా పప్పు, గుడ్డు, బుధవారం: కూరగాయలతో అన్నం, ఆలూకూర్మ, గుడ్డు, చిక్కీ, గురువారం: కిచిడీ(పెసరపప్పు అన్నం), టమోటా చట్నీ, గుడ్డు, శుక్రవారం: అన్నం, ఆకుకూరపప్పు, గుడ్డు, చిక్కీ, శనివారం: అన్నం, సాంబారు, స్వీట్‌పొంగలిని వండిపెడ్తున్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యపరిరక్షణలో భాగంగా ఉదయం 10.30గంటల ప్రాంతంలో గ్లాసు రాగి మాల్ట్ అందిస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

మహానంది: ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ విజయరావు ఆదేశించారు. బండిఆత్మకూరు సచివాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు అయ్యేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ నిర్ణీత వేళలకు హాజరు కావాలని సూచించారు. యర్రగుంట్ల సచివాలయం సందర్శించి సిబ్బందికి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై పలు సూచనలు చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

మిడుతూరు: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ గంగావతి హెచ్చరించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కార్యక్రమంలో భాగంగా గురువారం మిడుతూరు, రోళ్లపాడు, చెరుకుచెర్ల, అలగనూరు గ్రామాల్లో పర్యటించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులకు చెందిన వారు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో వలంటీర్లు ఎన్నికల విధుల్లో , పార్టీ ప్రచారంలో పాల్గొనరాదన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



వడ్లరామాపురంలో మాట్లాడుతున్న పోలీసులు

ఆత్మకూరు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండలంలోని కురుకుంద, వడ్ల రామాపురం, కొట్టాల చెరువు గ్రామాల్లో గురువారం రాత్రి బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, రాష్ట్రంలో త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నారాయణరెడ్డి, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

కుదుట పడిన ఆర్‌డీఓ ఆరోగ్యం

ఆత్మకూరు: ఆత్మకూరు ఆర్‌డీఓ దాస్ ఆరోగ్యం గురువారం కుదుట పడింది. రెండు రోజుల క్రితం ఆత్మకూరులో విధులు నిర్వహిస్తుండగా కార్యాలయంలో చేతులు, కాళ్లు తిమ్మిరి రావడంతో అస్వస్థతకు గురయ్యారు. కార్యాలయ సిబ్బందితో హుటాహుటీనా కర్నూలులోని ఓ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని, విషమంగా ఉన్నందున హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించడంతో చేరిన కొన్ని గంటలకే కోలుకున్నారు. ప్రస్తుతం ఆర్‌డీఓ దాసు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ కమిటీ సభ్యులు నిర్వహించిన ఎద్దుల బండలాగుడు పోటీలు గురువారం ఎంతో రసవత్తరంగా సాగాయి. పోటీలను గ్రామ సర్పంచ్ నవీన్, గ్రామ కమిటీ పెద్దలు ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 12 జతల ఎద్దులు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వడ్డె రంగస్వామి, సాలె షాలన్న, సీపీఎం రాజు, కొంగర అయ్యన్న, మహేష్, పర్వతాలు, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న గ్రామ కమిటీ సభ్యులు

నేడు రథోత్సవం

మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో శుక్రవారం సాయంత్రం భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త సాలె కిరణ్ తెలిపారు. కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జొన్న కొనుగోలు కేంద్రాల పరిశీలన

వెలుగోడు: మండల పరిధిలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు పరిశీలించారు. గురువారం మండలంలోని రేగడగూడూరు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, మార్క్‌ఫెడ్ జీఎం ఆదినారాయణ, మార్కెట్ డీఎం నాగరాజు, వెలుగోడు ఏఓ పవన్ కుమార్ లతో కలిసి సందర్శించారు. రబీలో సాగుచేసిన జొన్న పంటను ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటా రూ.3180 చొప్పున కొనుగోలు చేస్తోంది. రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల దిగుబడులను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు మోహన్‌రావు తెలిపారు. ఇప్పటికే నందాల జిల్లాలో 1,218 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 1,573 మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఏఓ మోహన్‌రావు

డౌన్ సిండ్రోమ్‌ను సకాలంలో గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ

నంద్యాల టౌన్: చిన్నారుల్లో డౌన్ సిండ్రోమ్‌ను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే వారికి మంచి భవిష్యత్ అందించవచ్చని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డైక్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్, పిడియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ అరుణ్ జ్యోతి మాట్లాడుతూ శబ్దాలకు, వెలుతురుకు, పాటలు తదితరులకు చిన్నారుల ప్రతిస్పందన సరిగా లేకపోతే తల్లిదండ్రులు డైక్ కేంద్రం నందు సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాలు భవిష్యత్తుకు ఆటంకం

కొత్తపల్లి: బాలికల ఉజ్వల భవిష్యత్తుకు బాల్య వివాహాలు ఎన్నో ఆటంకాలను సృష్టిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని దుద్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బేటీ బచావో- బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో బాలికల తల్లిదండ్రులు అవగాహన లోపంతో చిన్నవయస్సులోనే వారికి పెళ్లి చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంటారన్నారు. అటువంటి వారికి అంగన్‌వాడీ సిబ్బంది బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, ఏఎన్‌ఎంలు త్రివేణి, విమల జ్యోతి, జీఎంఎస్‌కె శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ తల్లిదండ్రుల బాధ్యత

పగిడ్యాల: ఆడ, మగ తేడా లేకుండా అందరిని సమానంగా చూస్తూ వారిని సంరక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ సూచించారు. గురువారం సంకిరేణిపల్లె, బీరవోలు అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంపై ఆడపిల్లల తల్లిండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరప్రసాదరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జగనన్నతోనే పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి

- మూకుమ్మడి పార్టీలు ఇచ్చే మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దు
- జగనన్న మళ్లీ సీఎం అయితేనే సంక్షేమం ప్రజ్వలిస్తుంది
- మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలి
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్

కొత్తపల్లి: జగనన్నతోనే పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. గురువారం మండలంలోని ముసలిమడుగు గ్రామంలో సర్పంచు శివపురం జమిలాబీ, పాతమాడుగుల గ్రామంలో సచివాలయాల మండల కన్వీనర్ పి.నాగలక్ష్మి రెడ్డిల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ మూకుమ్మడిగా ప్రజలవద్దకు వచ్చి ఇచ్చే మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దని సూచించారు. రాష్ట్రానికి మరోమారు జగనన్న ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమం ప్రజ్వలిస్తుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు వారి స్వలాభం కోసం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాన్ని బీజేపీ కాళ్లకింద పెట్టేందుకు సైతం వెనుకాడబోరన్నారు.



ముసలిమడుగు గ్రామంలో వృద్ధుడితో ఆప్యాయంగా మాట్లాడుతున్న దారా సుధీర్

పార్టీలకతీతంగా పథకాలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పథకాలు అందించారని దారా సుధీర్ అన్నారు. ఐదేళ్ల పాలనలో మీకు మంచి జరిగిందో లేదో గమనించుకొని ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వేయించి జగనన్నను మరలా ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అలాగే నందికొట్కూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కేవలం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం అన్నారు. ఎమ్మెల్యేగా తనను ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్‌రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్దన్‌రెడ్డి, కో-ఆప్టేడ్ మెంబర్ మహమ్మద్‌గౌస్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, ఎంపీటీసీ బాలరాజు, శివన్న, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా, నాగంపల్లి సొసైటీ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచు నాగన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహానందీశ్వర దంపతులకు ఏకాంతసేవ పూజలు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు గురువారం రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. స్థానిక యాగశాలలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా ఏకాంతసేవ పూజలు చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఏప్రిల్ 1 నుంచి బ్రహ్మోత్సవాలు

ఆత్మకూరు: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 1 నుంచి 6వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు. 1న సుప్రభాతసేవ, మహామంగళ హారతి, గోపూజ, నివేదన, 2న సంతార్జులకు గరుడప్రసాదాలు, జ్వాలాతోరణ పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 3న ఉదయం 11 గంటలకు శ్రీలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సామూహిక కుంకుమార్చనలు, వాహనోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 4న గోదా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, కుంకుమార్చనలు, 5న ఉత్సవ మూర్తులకు లక్ష కుంకుమార్చన, 6న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాలటౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం, మెరుగైన సేవలు అందించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల సమయంలో సెల్ 9959225800 నంబర్‌కు ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

మహానందిలో రేపు పదహారు రోజుల పండుగ

మహానంది: మహానందిలో ఈ నెల 23న పదహారు రోజుల పండుగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కల్యాణోత్సవ దీక్షా విరమణ, అంకుర విసర్జన, రథాంగ దేవతల ఉద్వాసన కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొని శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి అనుగ్రహం పొందాలని కోరారు. ఈ ఏడాది నవధాన్యాల అంకురాలకు మొలకలు బాగా వచ్చాయని, రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని వేదపండితులు రవిశంకర అవధాని తెలిపారు.



అంకురాలకు ఏపుగా మొలకలు వచ్చిన దృశ్యం

భానుడు భగభగ.. వీధులు వెలవెల

నందికొట్కూరు: భానుడి భగభగతో పట్టణ వీధులు వెలవెలబోయాయి. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి. గురువారం నందికొట్కూరు పట్టణంలో ఏకంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి పలు వీధుల్లో జన సంచారంలేక వెలవెలబోయాయి. నిత్యం రద్దీగా ఉండే గుంటూరు రోడ్డు, నంద్యాల రోడ్డు, పటేల్ సెంటర్‌తో పాటు పాత బస్టాండ్, కర్నూలు రోడ్డు వంటి ప్రాంతాల్లో పాదచారులు, ద్విచక్ర వాహనాదారుల జాడ కానరాలేదు. మధ్యాహ్నం సమయానికి పట్టణ వీధులు నిర్మానుష్యంగా మారాయి.



జన సంచారం లేని కర్నూలు-గుంటూరు రోడ్డు

బీజేపీతో పొత్తు రాష్ట్రానికి మరణశాసనం

పాములపాడు: మతోన్మాద బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీల పొత్తు రాష్ట్రానికి మరణశాసనమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం, సీనియర్ నాయకుడు రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆ మూడు పార్టీల పొత్తు రాష్ట్ర అభివృద్ధికి విఘాతమన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీతో పొత్తు పెట్టుకోవడం విశ్వాస ఘాతుకానికి పాల్పడటమేనని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించిన బీజేపీతో భాగస్వామిగా ఎన్‌డీఏలో చేరడం తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టడమేనని అభివర్ణించారు. ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలను చిత్తుగా ఓడించి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న, రామేశ్వరరావు, బాలయ్య, రమణ, బాలేసు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం